# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
11 | హైదరాబాద్,ఆదివారం 25 ఫిబ్రవరి 2024 | RANGAREDDY







ఆయుధ కర్మాగారం, క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా తదితరులు

## సఫాయన్నకు సత్కారం

**సమస్యాత్మక ప్రాంతాల్లో పని చేసిన పారిశుధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : నగరంలోని అత్యంత సమస్యాత్మకమైన చెత్త కేంద్రాల్లో పని చేసిన పారిశుధ్య కార్మికులకు జీహెచ్ఎంసీ ప్రశంసా పత్రాలతో సత్కరించింది. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మికులకు ప్రశంసా పత్రాలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికుల కృషి వల్లనే జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీకి ఎన్నో అవార్డులు వచ్చాయన్నారు. చెత్త తరలింపులో బాధ్యతాయుతంగా వ్యవహరించిన కార్మికులకు ప్రోత్సాహకాలు ఇస్తామని, అవార్డులు సాధించిన కార్మికులు మిగతా వారికి స్ఫూర్తిని కలిగించాలని ఆమె అన్నారు. నగరంలో 3400 జీవీపీలను గుర్తించామని కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. అలాగే చెత్తను ఆటోలకు ఇవ్వని కుటుంబాలను గుర్తించి వారి ఇంటికి వెళ్లి మెప్మాతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఏలను ఢిల్లీ వరకు తీసుకెళ్లి అవార్డును తీసుకున్నామన్నారు. అదేవిధంగా డిప్యూటీ కమిషనర్లు ఉదయం ఆరు గంటలకే క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ యూసీడీ హెల్త్ అడిషనల్ కమిషనర్లు ఉపేందర్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.

## పొలాలను బలవంతంగా లాక్కోవద్దు..

కొడంగల్, ఫిబ్రవరి 24 : మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలోని సర్వే నం. 19 భూములను కాపాడుకునేందుకుగాను అధికారులతో పలుమార్లు మొరపెట్టుకున్నా.. మళ్లీ... మళ్లీ.. సర్వేలు నిర్వహిస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్ పకీరప్ప, బసబయ్య, బుగ్గప్ప, అమృతప్ప, అంజయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సర్వే నంబర్ 19లో రెవెన్యూ సిబ్బంది బలవంతంగా సర్వే చేసేందుకు ప్రయత్నించడం చాలా బాధగా ఉన్నదన్నారు. గ్రామానికి చెందిన కొందరు భూముల ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. రైతులపై దౌర్జన్యం చేయడం జరిగిందని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదివరకే కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి, ఆర్డీవోతో పాటు తహసీల్దార్‌లకు వినతి పత్రాలను అందించి వేడుకున్నామని తెలిపారు. ఈ విషయమై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చామని పేర్కొన్నారు.

## అనధికార కరెంట్ కోతలు..
## విద్యుత్ ఉద్యోగులపై వేటు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యానికి గండికొడుతున్న విద్యుత్ ఉద్యోగులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నది. సైబర్ సిటీ సర్కిల్ కొండాపూర్ డివిజన్ పరిధిలోని అల్లాపూర్ సెక్షన్‌లో విద్యుత్ ఉద్యోగులు అనధికారికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసిన విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇదే సర్కిల్ పరిధిలో వారం రోజుల కిత్రం విద్యుత్ సరఫరా విషయంలోనే ఇష్టారాజ్యంగా వ్యవహరించిన డీఈ స్థాయిని అధికారిపై బదిలీ వేటు వేశారు. అల్లాపూర్ సెక్షన్ లోని అయ్యప్ప సొసైటీ సబ్‌స్టేషన్ పరిధిలో సర్వే ఆఫ్ ఇండియా కాలనీలో అనధికారికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి విద్యుత్ తీగల మార్పిడి పనులు చేసినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) క్రమశిక్షణా చర్యలకు ఆదేశించడంతో సర్కిల్ అధికారులు విచారణ చేసి ముగ్గురిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.



మూసీ సుందరీకరణ... కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మొదలైన ఈ బృహత్తర ప్రాజెక్టును రేవంత్ సర్కారు శరవేగంగా ముందుకు తీసుకుపోతున్నది. ఇందులో అత్యంత ప్రధానమైన మూసీ పరివాహక హద్దులను నిర్ధారించడంలో ఎంఆర్‌డీసీఎల్ (మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం డ్రోన్ సర్వే చేయగా... ప్రస్తుత ప్రభుత్వం మాత్రం మూసీ పొడవునా ఉన్న గ్రామ నక్షాల (విలేజ్ రెవెన్యూ మ్యాప్‌లు) ఆధారంగా హద్దులను నిర్ధారించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు రెండు రోజుల్లో సంబంధిత కన్సల్టెన్సీలతో సమావేశమై.. హద్దుల నిర్ధారణ ప్రక్రియ ఎలా నిర్వహించాలనే దానిపై విధానాన్ని రూపొందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే మూసీ పొడవున ఏయే ప్రదేశంలో ఎంతమేర సుందరీకరణ, వినోద, వాణిజ్య అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది? అనే అంశాలపై స్పష్టత వస్తుంది. ఈ ప్రాజెక్టుపై రూ.58వేల కోట్ల వరకు వెచ్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక అంచనాలు వేసుకుంది.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ)

# మూసీ హద్దులు.. నక్షతో నిర్ధారణ!

**విలేజ్ రెవెన్యూ మ్యాప్‌లతో అధికారుల కసరత్తు**


**అవసరమైతే భూసేకరణకూ ఎంఆర్‌డీసీఎల్ నిర్ణయం**

**రెండ్రోజుల్లో పరిధి గుర్తింపు ప్రక్రియపై స్పష్టత**

**రూ.58వేల కోట్లతో మూసీ సుందరీకరణ**

**వికారాబాద్‌లోని** అనంతగిరి అడవుల్లో పుట్టి... హైదరాబాద్ మహానగరంలో సుమారు 56 కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీని సబర్మతి తరహాలో సుందరీకరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.8 వేల కోట్లతో ప్రాజెక్టును చేపట్టింది. అయితే మూసీలోకి మురుగు నిలువరిస్తే తప్ప సుందరీకరణ సాధ్యంకాదని నిపుణులు స్పష్టం చేశారు. మూసీలోకి రోజుకు సుమారు 1800 మిలియన్ లీటర్ల మురుగు కలుస్తున్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు రోజుకు 700 మిలియన్ లీటర్ల మురుగును శుద్ధి చేసే ఎస్టీపీలు ఉన్నందున... మిగిలిన 1100 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఎస్టీపీల నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు రూ.3,820 కోట్లతో 38 వరకు ఎస్టీపీలను చేపట్టగా పనులు చివరి దశలో ఉన్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నగరం వంద శాతం మురుగును శుద్ధి చేస్తున్న ఏకైక నగరంగా గుర్తింపును సాధించనుంది. దీంతో పాటు కేసీఆర్ ప్రభుత్వం వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ)లో మురుగును మళ్లించే పనులు చేపట్టింది. దీంతో సుందీరకరణకు మార్గం సుగమం అయింది. మూసీపై ఉత్తర-దక్షిణ భాగాలను కలిపేలా 14 బ్రిడ్జీల నిర్మాణంతో సహా నదికి అనుగుణంగా ఈస్ట్-వెస్ట్ కారిడార్ రహదారికి డిజైన్లు రూపొందించడం, కొండపోచమ్మ సాగర్ నుంచి జంట జలాశయాలకు గోదావరిజలాలను తరలించి నదిని శుభ్రమైన నీటితో నింపడం వంటి ప్రణాళికలు తయారు చేసింది.

**థేమ్స్ తరహాలో రేవంత్ సర్కారు అడుగులు**



తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా మూసీ సుందరీకరణపై ప్రత్యేక దృష్టిసారించింది. థేమ్స్ నది తరహాలో ఈ నదిని సుందీరకరించి, నది పొడవునా వాణిజ్య, వినోద కారిడార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకుగాను ఏకంగా రూ.58వేల కోట్ల ప్రాజెక్టును 36 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నది. ఇందుకోసం సీఎం సహా అధికారులు థేమ్స్ పర్యటన పూర్తి చేసి, ప్రాథమిక అంచనాలు రూపొందిస్తున్నారు. తాజాగా నగరంలో నది పరివాహక సరిహద్దులను నిర్ధారించే ప్రక్రియను చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా జంట జలాశయాల నుంచి గౌరెల్లి వరకు మూసీలో ప్రవాహాలు ఎలా ఉన్నాయనే దానిపై (హైడ్రాలజీ స్టడీ) అధ్యయనం చేసేందుకు కన్సల్టెన్సీని ఎంపిక చేశారు. అయితే నగరంలో ఎక్కడెక్కడ నది వెడల్పు ఎంత ఉండాలని నిర్ధారించేందుకు దేనిని ప్రామాణికంగా తీసుకుంటారనేది ఇప్పుడు అత్యంత కీలక అంశంగా మారింది. ఇందుకుగాను గ్రామ నక్షాల (విలేజ్ రెవిన్యూ మ్యాప్‌లు) ఆధారంగానే దీనిని నిర్ధారిస్తారని విశ్వసనీయ సమాచారం. ఇదే ప్రామాణికమైతే నగరంలోని 56 కిలోమీటర్ల మేర రెండువైపులా పెద్ద ఎత్తున ఆక్రమణలతో నిర్మాణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిని తొలగించడం, అవసరమైతే ఎంఆర్‌డీసీఎల్ తరపున భూసేకరణ చేపట్టేందుకు కూడా సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో ఆక్రమణల తొలగింపు అంటే న్యాయపరమైన చిక్కులొచ్చే అవకాశాలుంటాయి గానీ ప్రభుత్వపరంగా భూసేకరణ చేపట్టినట్లయితే న్యాయపరమైన చిక్కులేవీ ఉండవనేది వ్యూహంగా కనిపిస్తున్నది. మూడు నెలల్లో హద్దుల నిర్ధారణ, రానున్న తొమ్మిది నెలల్లో రూ.58వేల కోట్ల అంచనాల మేర చేపట్టే పనులపై సమగ్ర నివేదిక పూర్తవుతుందని అధికారి ఒకరు తెలిపారు. ఈలోగా మూసీ పొడవున రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలనేది అధికారులు మొదటి ప్రాధాన్యతగా ఎంచుకున్నారు. ఇది పూర్తి కాగానే దానికి అనుగుణంగా మెట్రో ప్రాజెక్టు పనులను కూడా మొదలుపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఒక్కసారి రవాణా వ్యవస్థ పూర్తయితే వాణిజ్య, వినోద రంగాల అభివృద్ధి అనేది శరవేగంగా సాగుతున్నదని ప్రభుత్వం భావిస్తున్నది.

## శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పని చేయండి

**రాష్ట్ర అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా**

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 24 : శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది కట్టుబడి పని చేయాలని తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్ 3వ బెటాలియన్‌లో ఆయుధ కర్మాగారం, క్యాంటిన్, మెన్ బ్యారెక్స్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, యువతులపై ఎలాంటి అఘాయిత్యాలు జరుగకుండా ఉండేందుకు షీ టీమ్ పని చేస్తున్నదన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ కృషి చేస్తున్నదన్నారు. 3వ బెటాలియన్‌లో పూర్తి చేసిన ఆయుధ కర్మాగారంతో పాటు కొనసాగుతున్న పలు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం 3వ బెటాలియన్ ఆవరణలో పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్, ఐజీపీ మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ సైదిక్యూ, చీఫ్ ఇంజినీర్ తులసిదార్, కమాండెంట్ వేణుగోపాల్, అడిషనల్ కమాడెంట్ సురేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కల్వర్టుపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- పెద్దేముల్ గ్రామ శివారులో జరిగిన ఘటన
- ఇద్దరు ప్రయాణికులకు గాయాలు
- ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన పెను ప్రమాదం

పెద్దేముల్, ఫిబ్రవరి 24 : ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు కల్వర్టుపైకి దూసుకెళ్లిన సంఘటన శనివారం పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిలో సంగారెడ్డి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు, తాండూరు వైపు నుంచి వస్తున్న ఆటో ఎదురెదురుగా వస్తున్న క్రమంలో ఆటో ఒక్కసారిగా బస్సువైపునకు రావడంతో బస్సు డ్రైవర్ ఆటోను తప్పించే క్రమంలో కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రధాన కల్వర్టుపైకి దూసుకెళ్లింది. బస్సులో మొత్తం సుమారు 40 మంది ప్రయాణికులు ఉండగా, అందులో చిన్న పాప, మహిళకు స్వల్ప గాయాలయ్యాయి.



**సండే స్పెషల్** (SUNDAY SPECIAL)

# అనగనగా ఓ మర్రిచెట్టు..

'అనగనగా ఓ మారుమూల పల్లె.. ఆ పల్లెకు సమీపంలో ఓ పెద్ద మర్రిచెట్టు..' అని పెద్దలు చెప్పే కథనాలు ఎన్నెన్నో.. అలాంటి ఓ పెద్ద మర్రిచెట్టు బొంరాస్‌పేట మండలంలోని మదన్‌పల్లి గ్రామ సమీపంలో ఐదు ఎకరాల్లో విస్తరించి ఉన్నది. పిల్లల మర్రిగా ప్రసిద్ధి చెందిన ఈ చెట్టుకు నాలుగు వందల ఏండ్ల నాటి చరిత్ర ఉండడం విశేషం. పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

- మదన్‌పల్లిలో నాలుగు వందల ఏండ్ల నాటి మర్రిచెట్టు
- ఐదు ఎకరాల్లో విస్తరించిన అతిపెద్ద వృక్షం
- మహబూబ్‌నగర్ జిల్లాలోని మర్రిచెట్టుకు మాదిరిగా పిల్లల మర్రిగా ప్రసిద్ధి
- పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలని స్థానికుల డిమాండ్

**శతాబ్దాల చరిత్ర..** **అభివృద్ధి చేస్తే పర్యాటక శోభ**



బొంరాస్‌పేట, ఫిబ్రవరి 24 : పిల్లల మర్రి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉందని మనందరికీ తెలుసు. కానీ వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలంలో కూడా అలాంటి పిల్లల మర్రే ఒకటి ఉన్నది. మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి సమీపంలో ఉన్న భారీ మర్రిచెట్టుకు శతాబ్దాల చరిత్రే ఉన్నది. ఐదు ఎకరాల్లో విస్తరించిన ఈ మర్రిచెట్టు మొదలు ఎక్కడ ఉన్నదో గ్రామస్తులే కాదు ఎవరూ గుర్తించలేరు. ఊడలు, ఊడలుగా విస్తరించి ఉన్న ఈ స్థలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు వస్తుందని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్లు, గ్రామానికి కిలో మీటరు దూరంలో సర్వే నంబర్ 66లో ఐదు ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ మర్రి చెట్టుకు సుమారు నాలుగు వందల ఏండ్ల చరిత్ర ఉన్నదని గ్రామస్తులు చెబుతారు. చెట్టు కొమ్మలు శాఖోప శాఖలుగా విస్తరించడంతో దీని మొదలు ఎక్కడ ఉన్నదో నేటికీ ఎవరూ గుర్తించలేకపోయారు. పూర్వకాలంలో చెట్టుపై వందల సంఖ్యలో తేనెతెట్టెలు ఉండేవి. తెట్టెల నుంచి తేనెను తీయడానికి హైదరాబాద్ నుంచి వచ్చేవారని గ్రామస్తులు చెబుతారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న మర్రిచెట్టుకు సరైన ఆదరణ లేక ప్రాచుర్యంలోకి రాలేదు. గ్రామం నుంచి కిలో మీటరు దూరంలో ఉన్న చెట్టు వరకు సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు. పట్టాదారు భూమిలో విస్తరించిన ఈ మర్రిచెట్టును గతంలో నరికేయడానికి ప్రయత్నించగా అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చెట్టును నరికే ప్రయత్నాలను నిలువరించారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మదన్‌పల్లి నుంచి మర్రి చెట్టు వరకు రోడ్డు సౌకర్యం కల్పించి మర్రి చెట్టు ఉన్న ప్రాంతాన్ని పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## బాబన్‌సాబ్ దర్గా.. ఇంటింటికో బాబయ్య

మర్రిచెట్టు కింద బాబన్‌సాబ్ దర్గా ఉన్నది. ఈ దర్గాకు చాలా మహత్యం ఉండేదని ప్రజలు చెబుతుంటారు. పూర్వకాలంలో బాబన్‌సాబ్ అనే వ్యక్తి గ్రామంలో కొలుపు (జాతకాలు) చెప్పేవాడని, ఆయన చనిపోతే ప్రస్తుతం దర్గా ఉన్న ప్రాంతంలోనే సమాధి చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. దర్గాకు సమీపంలో ఉన్న గుండానికి కూడా ప్రాధాన్యత ఉన్నది. గతంలో పీర్ల పండుగ సందర్భంగా ఊరేగింపులో వెలుతురు కోసం వెలిగించే దివిటీలపై ఈ గుండంలోని నీటిని పోస్తే అవి వెలిగేవని అంటారు. ఇప్పటికీ వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు దర్గా వద్దకు వచ్చి కందూర్లు చేస్తారు. బాబన్‌సాబ్ దర్గా మహత్యం మూలంగానే మదన్‌పల్లి గ్రామంలో చాలా మందికి బాబయ్య అనే పేర్లు ఉన్నాయి. దాదాపు ప్రతి ఇంట్లో బాబయ్య అనే పేరున్న వ్యక్తి తప్పక ఉంటాడు.